


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 16- 12- 2025 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక :195 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా రాజ్ కుమార్ గోయల్ ప్రమాణం .. హాజరైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి



2లో

## అత్త గొంతు కోసిన అల్లుడు



2లో

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాను : కవిత



2లో

## పాఠశాల సామాగ్రి ధ్వంసం చేసిన ఆకతాయిలు



2లో

## దేశంలోనే తొలిసారి.. సరికొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన టీటీడీ..



4లో


## కవిత మీద అవాకులు పేలితే
# వి. ప్రకాష్ నీ నాలుక చీరేస్తాం



● హరీష్ రావు ఫేక్ టీమ్ కు లీడర్ గా నిన్ను ఎంపిక చేసినట్లు ఉన్నారు ● ప్యాకేజీ స్టార్ వి నువ్వు. సుపారీ ఇచ్చిన లీడర్ కు ఊడిగం చేస్తున్నావ్? ● బీఆర్ఎస్ ఓటమికి కేసీఆర్, కేటీఆర్ ల వైఖరే కారణమని గతంలో మాట్లాడావ్ ● నీళ్ల విషయంలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసిన కవితమ్మను పొడిడావ్ ● ఆరు నెలల్లో ఏమీ మారిందని ప్లేట్ మార్చావ్ ● నిరాధరమైన ఆరోపణలు, నిందలు వేస్తే నిన్ను బొందపెడతాం ● కవితమ్మ అవినీతిలో కూరుకుపోయిందంటూ బద్నాం చేసే వారికి తీవ్ర పరిణామాలుంటాయ్ ● జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, సీనియర్ నాయకులు ఇస్మాయిల్

3లో

## కోఠి మహిళా వర్సిటీలో వేధింపులు..!



2లో

కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్న విద్యార్థినులు, తాము ఉంటున్న ఉస్మానియా యూనివర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లో మెస్ ఇంచార్జ్ వినోద్ తమను వేధిస్తున్నాడంటూ షీటీమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థినులు తమ ఆవేదనను ఆడియో రూపంలో వెల్లడించారు.

## అమెరికా నుంచి వచ్చి ఓటు వేసిన మామ... ఒక్క ఓటు తేడాతో గెలిచిన కోడలు



3లో

## అక్రమ కఫ్ సిరప్ దందా..
### 3 రాష్ట్రాల్లో 25 చోట్ల ఈడీ అధికారుల సోదాలు




అక్రమ కోడిన్ ఆధారిత కఫ్ సిరప్ దందాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు ఇవాళ ఉదయం మూడు రాష్ట్రాల్లో కఫ్ సిరప్ నిల్వలు, డైవర్షన్, అమ్మకాలకు సంబంధించి మొత్తం 25 చోట్ల సోదాలు చేపడుతోంది. ఉత్తరప్రదేశ్ పోలీసులు నమోదు చేసిన 30 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద నమోదైన కేసును నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేసింది.

## న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల మార్గదర్శకాలు



న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత ఆనందోత్సవ వాతావరణంలో జరుపుకునేందుకు పోలీసులు భద్రతా పరంగా అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేడుకలను నిర్వహించే అన్ని హోటల్స్ యాజమాన్యాలు, ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు పలు మార్గదర్శకాలను జారీ చేశారు. డిసెంబరు 31 రాత్రి ఒంటి గంట వరకు కొత్త సంవత్సరం స్వాగత వేడుకలను నిర్వహించేందుకు అనుమతి ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. ఈ వేడుకలకు సంబంధించిన హైదరాబాద్ పోలీసులు జారీ చేసిన మార్గదర్శకాలు: వేడుకలు జరిగే ప్రాంతంలో కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాల్లో రికార్డింగ్ తప్పనిసరిగా ఉండాలి. పార్కింగ్ ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. 15 రోజుల ముందే అనుమతుల కోసం దరఖాస్తు చేసుని పోలీసుల అనుమతి తీసుకోవాలి. వేడుకల నిర్వాహకులు ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ ను ఏర్పాటు చేసుకోవాలి. వేడుకల వద్ద సెక్యూరిటీని పటిష్ఠంగా పెట్టుకోవాలి. అశ్లీలత ఉండొద్దు. సౌండ్ సిస్టమ్ లకు రాత్రి 10 తర్వాత అనుమతి లేదు. 10 తర్వాత 45 డెసిబెల్స్ మించకుండా సౌండ్ ను వాడొచ్చు. బహిరంగంగా ఈ శబ్దానికి కూడా అనుమతి లేదు. కేవలం హోటల్స్, కమ్యూనిటీ హాల్స్, బాంక్వెట్ హాల్స్ ఇండోర్ లోనే ఈ సౌండ్ కు అనుమతి ఉంటుంది. అది కూడా రాత్రి 1 గంటల వరకు మాత్రమే. వేడుక జరిగే ప్రాంతంలో సామర్థ్యానికి మించి పాసులు, టికెట్లను విక్రయించొద్దు. వేడుకలు జరిగే ప్రాంతం వద్ద ఫైర్ ఆర్మ్స్ ను అనుమతించవద్దు. పబ్స్, బార్ లు, కపుల్స్ కార్యక్రమాల్లో మైనర్ లను అనుమతించవద్దు. వేడుకల్లో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడొద్దు. అలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయి. కాబట్టి నిర్వాహకులు మద్యం సేవించి వాహనాలను నడుపకుండా డ్రైవర్ లను ఏర్పాటు చేయాలి. వేడుకల వద్ద డ్రంకన్ డ్రైవింగ్ నేరము. పెనాల్టీ 10 వేలు, లేదా 6 నెలలు జైలు ఉంటుందనే ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయాలి. ఎక్సైజ్ అధికారుల నిబంధనల మేరకే వేడుకల వద్ద మద్యాన్ని అందించాలి. ఎక్సైజ్ అధికారుల సమయ నిబంధనలను కచ్చితంగా పాటించాలి.

# తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు
## కొత్తవారికి ఛాన్స్, పీసీసీ కీలక కామెంట్స్

- క్యాబినెట్ ప్రక్షాళనపై చర్చలు జోరు
- అధిష్ఠానం నిర్ణయమే తుది మాట
- మంత్రి పదవిపై ఆసక్తి లేదని స్పష్టం
- పార్టీ పదవికే ఎక్కువ ప్రాధాన్యం
- సీఎం పాలనపై పూర్తి విశ్వాసం
- బీసీలకు న్యాయమే కాంగ్రెస్ లక్ష్యం
- ఖాళీ పదవుల భర్తీకి కసరత్తు

మిగతా 2 లో

తెలంగాణ క్యాబినెట్ ప్రక్షాళనపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గం ప్రక్షాళన కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయితే ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని ఆయన స్పష్టం చేశారు. తనకు మాత్రం మంత్రివర్గంలోకి వెళ్లే ఉద్దేశం ఏ మాత్రం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రికి కూడా ఉండని ప్రాధాన్యం పీసీసీ అధ్యక్షునికి ఉంటుందని చెప్పారు. ఈ కారణంగానే.. పార్టీ అధ్యక్షుడిగానే కొనసాగడానికి తాను ఇష్టపడుతున్నట్లు వివరించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. తాము పార్టీ కోసం పనిచేయాలని భావిస్తుండగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాత్రం మంత్రివర్గంలో చేరితే బాగుంటుందని అడిగారని తెలిపారు.



## బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుంది




ఢిల్లీలో నిర్వహించిన బీసీ మహా ధర్నాలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీసీ రిజర్వేషన్ల పోరాటంలో కాంగ్రెస్ పార్టీ నిబద్ధతను శంకించాల్సిన అవసరం లేదని, బీసీ రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లోనే బీసీ రిజర్వేషన్ల నిర్ణయం తీసుకున్నామని, కోర్టు గడువు కారణంగానే పంచాయితీ ఎన్నికలకు వెళ్లినా, కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.తాను ఈ ధర్నాకు వ్యక్తిగతంగా కాకుండా పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చానని, బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారని, అయితే కేంద్రం ఈ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చకుండా తొక్కి పెడుతోందని ఆయన కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

## ఐపీఎస్ పూరన్ కుమార్ ఆత్మహత్య.. డీజీపీపై హర్యానా సర్కార్ వేటు



2లో

## హిస్టరీలో ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి విలువ.. డాలర్‌తో పోలిస్తే రూ.90.75కి డౌన్



2లో

## ఈ నెల 17న ఢిల్లీ-ఎన్‌సీఆర్ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు విచారణ



2లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 16-12-2025

# కోఠి మహిళా వర్సిటీలో వేధింపులు..!

మొదటి పేజీ తరువాయి

మెస్ ఇంచార్జీ వినోద్ ప్రవర్తన వల్ల హాస్టల్‌లో ఉండాలంటే భయంగా ఉందని, విద్యార్థినుల భద్రతే ప్రశ్నార్థకంగా మారిందని వారు పేర్కొన్నారు. వినోద్ వల్ల అనేక మంది విద్యార్థినులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

ఈ విషయమై ఇప్పటికే హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపాల్‌లకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రహస్యంగా ఆన్‌లైన్ ద్వారా షీటీమ్ పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. తమ పేర్లు బయటకు వస్తే కెరీర్‌కు, భవిష్యత్తుకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టి, మెస్ ఇంచార్జీ వినోద్‌పై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధిత విద్యార్థినులు షీటీమ్ పోలీసులను కోరుతున్నారు.

## చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా రాజ్ కుమార్ గోయల్ ప్రమాణం .. హాజరైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి



మాజీ ఐఏఎస్ అధికారి రాజ్ కుమార్ గోయల్ భారత కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో నిరాడబరంగా జరిగింది. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, తదితరులు హాజరయ్యారు.

కాగా, 1990 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాజ్ కుమార్ గోయల్ ఇటీవలే కేంద్ర ప్రభుత్వంలో న్యాయ శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. గతంలో హెూంశాఖలో బోర్డర్ మేనేజ్‌మెంట్ సెక్రటరీగా కూడా పనిచేశారు. ఈ నియామకంతో సుమారు 9 ఏళ్ల తర్వాత కేంద్ర సమాచార కమిషన్ పూర్తి స్థాయి సామర్థ్యంతో పని చేయనుంది. గత సెప్టెంబర్‌లో హీరాలాల్ సమరియా పదవీ కాలం ముగియడంతో సీఐసీ పోస్టు ఖాళీ అయింది. అదనంగా 8 మంది కొత్త సమాచార కమిషనర్లు కూడా నియమితులయ్యారు. వారంతా అతి త్వరాలోనే కొత్త సీఐసీ ముందు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నియామకాలు సమాచార హక్కు చట్టం అమలులో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడానికి దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# అక్రమ కఫ్ సిరప్ దందా.. 3 రాష్ట్రాల్లో 25 చోట్ల ఈడీ అధికారుల సోదాలు

మొదటి పేజీ తరువాయి

కేసులో భాగంగా ప్రధాన నిందితుడు శుభం జైస్వాల్, అతని చార్టర్డ్ అకౌంటెంట్ విష్ణు అగర్వాల్, డిస్మిస్ చేయబడిన యూపీ పోలీస్ కానిస్టేబుల్ అలోక్ సింగ్, అమిత్ సింగ్, విశాల్ సింగ్ ఇళ్లు, కార్యాలయాల్లో రైడ్స్ కొనసాగుతున్నాయి.

మరోవైపు లక్నో లోని ఒక కంపెనీ కార్యాలయం నుంచి ఈడీ 46,891 కఫ్ సిరప్ బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. నిందితులు వివిధ సంస్థల ద్వారా పెద్ద మొత్తంలో సిబిసిఎస్ ను సేకరించి మోసపూరిత లైసెన్స్‌లు పొందారని గుర్తించారు. రికార్డులను కూడా నకిలీగా తయారు చేశారని, వైద్యేతర, నార్కోటిక్ ప్రయోజనాల కోసం స్టాక్‌ను డైవర్ట్ చేసి రాష్ట్ర సరిహద్దులు దాటి నేపాల్, బంగ్లాదేశ్‌లకు కూడా సరఫరా చేశారని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఉత్తరప్రదేశ్ పోలీసుల స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఈ దందాను బట్టబయలు చేశాక బిహార్ మీదుగా భారత్ నుంచి పారిపోయిన మాస్టర్‌మైండ్‌లను గుర్తించేందుకు ఈడీ అధికారులు నేపాల్ వెళ్లనున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పోలీసులు ఇప్పటికే 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. కానీ, ప్రధాన నిందితుడు శుభం జైస్వాల్ దుబాయ్‌కు పారిపోయినట్లుగా తెలుస్తోంది.

# దారుణం.. అత్త గొంతు కోసిన అల్లుడు



ఎర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అత్త రమణమ్మపై అల్లుడు నారాయణ కత్తితో దాడి చేసి గొంతు కోశాడు. తీవ్ర గాయాలతో ఉన్న రవణమ్మను ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద అల్లుడు నారాయణపై అత్త బంధువుల ఎదురు దాడి చేశారు. దీంతో గ్రామంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి.కాగా గతంలో రమణమ్మ కూతురు కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకొని చనిపోయారు. అప్పటినుండి అత్త రమణమ్మకు అల్లుడు నారాయణకు మధ్య గొడవలు జరుగుతున్నారు. ఈ నేపథ్యంలోనే అత్త రమణమ్మపై నారాయణ కత్తితో దాడి చేసి గొంతు కోశారని ఎర్రగొండపాలెం ఎస్సై చౌడయ్య తెలిపారు.

# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాను : కవిత

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేసారు. తాను 2029 ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేసారు. అయితే సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఎక్స్ వేదికగా హ్యాష్ ట్యాగ్ ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహిస్తున్నానని కవిత ముందుగానే అనౌన్స్ చేసారు. అయితే కొద్దిసేపటి క్రితం ప్రారంభం అయిన క్వశ్చన్ అవర్ లో " మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ఓ నెటిజన్ అడగగా.. ఎలా ఉండాలో చెప్పమని కవిత బదులిచ్చారు.

త్వరలోనే జాగృతిని గ్రామాలకు విస్తరిస్తానని, ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. తాను 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొంటానని తెలిపిన కవిత.. జాగృతి ఎన్నికల బరిలో నిలువబోతోందని హింట్ ఇచ్చారు. 2047 నాటికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే తన విజన్, తన మిషన్ అని కవిత పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుంది

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నారని, ఎన్నికలు జరుగుతున్నప్పటికీ బీసీ రిజర్వేషన్ల అంశం అటకెక్కలేదని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ పార్టీలన్నీ కలిసి కేంద్రంపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. చివరిగా, తెలంగాణలో 56 శాతం బీసీలు ఉన్నారని కుల సర్వే ద్వారా చెప్పింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని గుర్తు చేస్తూ, బీసీ సంఘాలతో కలిసి రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తామని గౌడ్ ప్రకటించారు.

# పాఠశాల సామాగ్రి ధ్వంసం చేసిన ఆకతాయిలు



కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిన్న పాఠశాలకు సెలవు రోజు కావడంతో ఆకతాయిలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి పాఠశాల యొక్క మరుగుదొడ్ల డోర్లు, ఎలెక్ట్రిసిటీ మీటర్ వైర్, తాగునీటి ట్యాప్ లు ఇతరత్ర సామాగ్రిని ధ్వంసం జరిగినందున సోమవారం కలెక్టర్ కె. హైమావతి పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల సామాగ్రిని ధ్వంసం చేయడం ఎవరనే విషయాలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో కలిసి ఆరా తీశారు. తక్షణమే డ్యామేజ్ అయినవి అన్ని రిపేర్ చేయిస్తామని తెలిపారు. ధ్వంసం చేసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేసి ఇలాంటి దుశ్చర్య కి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. మీకు ఎలాంటి ఆధారాలు దొరికినా పోలీస్ అధికారులకు తెలపాలని పాఠశాల అధికారులకు తెలిపారు. చుట్టు సిసి కెమెరా లు పెట్టించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాఠశాలకు సంబంధించిన ఎలెక్ట్రికిసిటీ కనెక్షన్, పర్నిచర్ ఇతరత్ర ఏ వస్తువు కూడా బయట ఉంచకుండా లోపల భద్రపరిచి తాళం వేసేలా ఉండాలని ప్రిన్సిపల్ కి సూచించారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులతో శిక్షిస్తామని తెలిపారు.

# ఐపిఎస్ పూరన్ కుమార్ ఆత్మహత్య.. డీజీపీపై హర్యానా సర్కార్ వేటు

ఐఏఎస్ పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో సంచనల పరిణామం చోటచేసుకుంది. ఈ మేరకు అక్టోబర్ నెలలో సెలువుపై వెళ్లి తిరిగి విధుల్లో జాయిన్ అయిన డీజీపీ శత్రుజీత్ కపూర్ ను బాధ్యతల నుంచి తప్పిస్తూ హర్యానా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాగా, 2001 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ పూరన్ కుమార్ అక్టోబర్ 7న చండీఘర్‌లోని తన నివాసంలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే, ఆయన వదిలివేసిన 9 పేజీల సూసైడ్ నోట్‌లో డీజీపీ శత్రుజీత్ కపూర్, అప్పటి రోహ్తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియా సహా పలువురు సీనియర్ అధికారులు తనపై కుల వివక్ష, మానసిక వేధింపులు, ప్రజల ముందు అవమానాలు, వృత్తిపరంగా తనను టార్చర్ చేశారంటూ ఆరోపించారు. దీంతో పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అధికారి అమ్నీత్ పి కుమార్ నిందిత అధికారులపై ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన దర్యాప్తు హామీ ఇచ్చిన తర్వాతనే పోస్ట్‌మార్టంకు అనుమతినిచ్చారు.



## హిస్టరీలో ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ.. డాలర్‌తో పోలిస్తే రూ.90.75కి డౌన్

డాలర్‌తో పోలిస్తే చరిత్రలో ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి విలువ పడిపోయింది. నేటి ఇంట్రాడే లో రూపాయి విలువు రూ.90.75 పైసల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది గత వారం నమోదైన 90.55, 90.56 స్థాయిలను మించి అత్యంత కనిష్టానికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం ఆలస్యం కావడంతో పాటు విదేశీ పెట్టుబడుల భారీ ఉపసంహరణలు, వాణిజ్య లోటు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అయితే, ఆర్బీఐ జోక్యంతో రూపాయి పతనానికి కాస్త అడ్డుకట్ట పడినా.. ఆ ఒత్తిడి ఇంకా కొనసాగుతూనేఉంది. ముఖ్యంగా యూఎస్‌తో ట్రేడ్ డీల్ లేకపోవడం, పెర్సిస్టెంట్ ఔట్‌ఫ్లోస్ కారణంగా ఆసియాలోనే అత్యంత బలహీన కరెన్సీగా రూపాయి నిలిచింది. ఈ ఏడాది రూ.5.5 శాతం నుంచి 6 శాతం వరకు రూపాయి విలువ కోల్పోయింది.

# ఈ నెల 17న ఢిల్లీ-ఎన్‌సీఆర్ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు విచారణ

గత కొద్ది రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్యపై ఇప్పటికే పార్లమెంట్ లో చర్చ పెట్టాలని ప్రతిపక్షాల డిమాండ్ చేయగా కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే పలువురు ఢిల్లీ–నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్)లో తీవ్రమవుతున్న వాయు కాలుష్య సంక్షోభంపై విచారించాలని సుప్రీం కోర్టు లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను డిసెంబర్ 17వ తేదీన విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చి, విపుల్ ఎం పంఛోలిలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించింది.

కోర్టుకు అమికస్ క్యూరీ (న్యాయ సహాయకురాలు)గా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ ముఖ్యమైన వాదనలు వినిపించారు. నివారణ చర్యలు ఇప్పటికే ఉన్నప్పటికీ, అధికారులచే వాటి అమలు సరిగా జరగకపోవడం ప్రధాన సమస్యగా ఉందని వారు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు అధికారులు ఉన్న ప్రోటోకాల్స్‌ను కూడా పాటించడం లేదని సింగ్ పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సీజేఐ, ఈ కేసు డిసెంబర్ 17న ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు విచారణకు వస్తుందని స్పష్టం చేశారు.

# మొయినాబాద్ బర్త్ డే పార్టీ కేసు..

## దివ్వెల మాధురి బంధువుకు పోలీసుల నోటీసులు




మొయినాబాద్ పరిధిలోని 'ది పెండెంట్' ఫామ్‌హౌస్‌లో అనుమతి లేకుండా విదేశీ మద్యం, హుక్కా పార్టీ నిర్వహిస్తున్న నలుగురిపై ఎస్‌వోటీ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అందులో ప్రముఖ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అనుచరుడు, దివ్వెల మాధురి సమీ బంధవు పార్థసారథి కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఇవాళ దివ్వెల మాధురి బంధవు పార్థసారథికి మొయినాబాద్ పోలీసులు కోర్టు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు.

కాగా, ఈనెల 12న 'ది పెండెంట్' ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రధాన అనుచరుడు పార్థసారథి బర్త్‌డే పార్టీ నిర్వహించాడు. ఈ పార్టీకి దువ్వాడ శ్రీనివాస్, దవ్వెల మాధురి కూడా హాజరయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌వోటీ టీమ్ ఫామ్‌హౌస్‌పై రెయిడ్ చేసింది. పార్టీకి ఎలాంటి అనుమతి లేకపోవడంతో 7 విదేశీ మద్యం బాటిళ్లు, హుక్కాను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. బర్త్‌డే పార్టీకి 29 మంది హాజరయ్యారు. పార్థసారథితో పాటు ఫామ్‌హౌస్ యజమాని సుభాష్, వాచ్‌మెన్ షేక్, హుక్కా తీసుకొచ్చిన రియాజ్‌పై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు.. కొత్తవారికి ఛాన్స్, పీసీసీ కీలక కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

అయితే, తాను మాత్రం పార్టీ కోసం పనిచేయడమే ఇష్టమని చెప్పినట్లు వివరించారు. ఆదివారం రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' ఆందోళనలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై మహేశ్‌కుమార్‌గౌడ్ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంచి విజన్ ఉందని.. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన పట్టుదలతో పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో హైదరాబాద్‌తో ఎవ్వరూ పోటీపడలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నగరాన్ని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు న్యాయం చేస్తోందని, డీసీసీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం ఇందుకు నిదర్శనమని గౌడ్ స్పష్టం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వివిధ పదవుల భర్తీని నెలరోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌ల విషయంలో రేగిన వివాదాలు సద్దుమణిగాయని, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం కూడా సంతృప్తిగానే ఉందని ఆయన వివరించారు.

కాగా, తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు ఖాళీలు ఉన్నాయి. తొలిసారి విస్తరణలో వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ పదవులు దక్కించుకున్నారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో అజారుద్దీన్‌కు సైతం మంత్రి పదవి ఇచ్చారు. ప్రస్తుతం రెండు పదవులు ఖాళీగా ఉండగా.. పలువురు సీనియర్లు పోటీ పడుతున్నారు. వారిలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు ముందు వరుసలో ఉన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇచ్చే దిశగా కాంగ్రెస్ అదిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

# స్టీల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు.. ఒకరి మృతి



రాష్ట్రంలో మరో భారీ ఫ్యాక్టరీ ప్రమాదం చోటు చేసుకుంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం చెట్లగౌరారంలో ఉన్న ఎంఎస్ స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడు జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. అయితే ఘటనాస్థలికి వెళ్లేందుకు కార్మికుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాగా మృతుడికి, క్షతగాత్రులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రమాదానికి గల కారణాలు కూడా తెలియాల్సి ఉంది.

# సిర్పూర్ టీ లో కలకలం..!



ఓటమి జీర్ణించుకోలేక ఓ ప్రత్యర్థి భర్త గెలుపొందిన సర్పంచ్ భర్త పై వేట కొడవలితో దాడి పాల్పడిన సంఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలంలో కలకలం రేపింది. సిర్పూర్ టీ మండలంలోని ఇటిక్యాల పహాడ్ గ్రామ పంచాయతీ కు ఆదివారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి వాడై తాను బాయి గెలుపొందగా.. ప్రత్యర్థి భర్త మొహర్లే భీం రావు ఓటమి జీర్ణించుకోలేక సోమవారం ఉదయం సదరు మహిళ సర్పంచ్ ఇంటికి వెళ్లి ఆమె భర్త పోశెట్టిపై వేట కొడవలితో దాడికి యత్నించగా ఆయన తృటిలో తప్పించుకున్నారు. గ్రామస్తులు గమనించి దాడి యత్నించిన భీం రావు అడ్డుకుని..తాడుతో బంధించి చితకబాదారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ తరహాలో గెలుపొందిన అభ్యర్థి పై ప్రత్యర్థి దాడికి యత్నించడం ఇది జిల్లాలో రెండు సంఘటన..మొదటి విడతలో కెరమెరి మండలంలోని పరంధోళి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో సర్పంచ్ గా గెలిచిన రాథోడ్ పుష్పలత పై ప్రత్యర్థి దిలీప్ కాటే ఆమె గొడవతో దాడికి యత్నించగా ఆమె తృటిలో తప్పించుకోగా సదరు మహిళ సర్పంచ్ మామకు గాయాలయ్యాయి.


# తుది దశ పోరుకు సిద్ధం! మూడో విడత ఎన్నికల ప్రచారం బంద్

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత ప్రచారం సోమవారం సాయంత్రంతో గడువు ముగిసింది. ప్రచార డప్పులు మోగడం ఆగిపోవడంతో, ఇప్పుడు అభ్యర్థులు, కార్యకర్తలు పోలింగ్ రోజు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 17 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడో విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఈ విడతలో మొత్తం 182 మండలాల్లోని 3 752 గ్రామ పంచాయతీలు ఎన్నికల రంగంలోకి దిగుతున్నాయి.

మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,752 గ్రామ పంచాయతీలకు, 28,406 వార్డులకు 75,283 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ విడతలో 4,157 గ్రామాలకు, 36,434 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 394 గ్రామాలు,7916 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 3, 752 గ్రామ పంచాయతీల్లో 12,640 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ పడుతున్నారు. కాగా, 11 గ్రామాలకు,112 వార్డులకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు.

మద్యం దుకాణాలు బంద్..

ఎన్నికల నిబంధనల ప్రకారం, సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 17 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులకు బంద్ అమల్లోకి వచ్చింది. ఇక తుది విడత పోరుకు అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది సిద్ధమయ్యారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో ఇప్పటికే పోలింగ్ సామగ్రి చేరుకుంది. 16న ఉదయం 7 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ షురూ అవుతుంది.



## డీలిమిటేషన్ ద్వారా రాజకీయ ఆధిపత్యానికి యత్నం: వనం శ్రీరామ్ రెడ్డి



ఇది కద నిజం, రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ డీలిమిటేషన్ ప్రక్రియ వెనుక స్పష్టమైన రాజకీయ ఎజెండా దాగి ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వనం శ్రీరామ్ రెడ్డి అన్నారు. సులేమాన్ నగర్ డివిజన్‌కు చెందిన మిలారం ట్యాంక్ సెట్విన్ కాలనీని అత్తాపూర్ డివిజన్‌లో కలపాలనే నిర్ణయం పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమే తీసుకున్నదని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వనం శ్రీరామ్ రెడ్డి రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజెశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ డీలిమిటేషన్ పేరుతో ఎంఐఎం తన రాజకీయ ప్రభావాన్ని విస్తరించేందుకు పథకబద్ధంగా ముందుకు వస్తోందని మండిపడ్డారు. అత్తాపూర్ డివిజన్‌ను తమ ఆధీనంలోకి తీసుకునే ఉద్దేశంతోనే సరిహద్దుల మార్పులు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజల అభిప్రాయాన్ని పక్కనపెట్టి, కేవలం రాజకీయ ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతోనే ఈ మార్పులు అమలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ డీలిమిటేషన్ వల్ల అత్తాపూర్ డివిజన్ ప్రజల హక్కులు దెబ్బతింటాయని, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలు కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని వనం శ్రీరామ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, మిలారం ట్యాంక్ సెట్విన్ కాలనీని అత్తాపూర్ డివిజన్‌లో కలపకుండా యథాతథ పరిస్థితిని కొనసాగించాలని అధికారులను డిమాండ్ చేశారు. అంతేకాకుండా, డీలిమిటేషన్ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిస్తూ, అత్తాపూర్ డివిజన్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాలకు కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తల్వార్ నర్సింగ్, కె. అశోక్, బి.కాశీం, ఎం.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం క్షేత్రానికి భారీగా తరలివచ్చిన సాధువులు



ఇది కద నిజం, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ కాళేశ్వరం క్షేత్రం ఆదివారం భక్తుల నాదాలతో మార్మోగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాధువులు, సన్యాసులు భారీ సంఖ్యలో కాళేశ్వరానికి తరలివచ్చారు. గోదావరి ప్రదక్షిణ యాత్రలో భాగంగా యానం నుంచి ఆదివారమే కాళేశ్వరానికి చేరుకున్న వారు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. దాదాపు 500 మందికి పైగా సాధువులు త్రివేణీ సంగమంలో స్నానాలు చేసి అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడికి అభిషేక పూజలు, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడగా, పూజా కార్యక్రమాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోదావరి ప్రదక్షిణ యాత్రలో భాగంగా కాళేశ్వరానికి వచ్చిన సాధువుల పూజలు క్షేత్రానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి.

## ప్రజావాణి ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం : జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



ఇది కద నిజం, హైదరాబాద్: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కి పూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ఆయన పర్యవేక్షణలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్‌కు చెందిన టౌన్ ప్లానింగ్ సమస్యపై ఒకటి, ఇంజినీరింగ్ సమస్యపై ఒకటి, చాంద్రాయణ గుట్ట సర్కిల్‌కు చెందిన ఇంజినీరింగ్ సమస్యపై ఒకటి మొత్తం మూడు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ బస్తీలు, ఖాళీ స్థలాల్లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, అక్రమ నిర్మాణాలు, వీధి దీపాలు, వీధి కుక్కల బెడద, క్రీడా మైదానాలు, పార్కులు, దోమల సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత విభాగాల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి. శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డా. శ్రీనివాస్ రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ సతీష్ రెడ్డి, ఎల్ఆర్ఎస్ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ యాసీన్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో డివిజన్ పేర్ల మార్పుపై డిప్యూటీ కమిషనర్‌కు ప్రతినిధిత్వం



ఇది కద నిజం: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో వార్డుల డిలిమిటేషన్ సందర్భంగా విడుదల చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌లో డివిజన్ నంబర్ 284 (కుత్బుల్లాపూర్) మరియు డివిజన్ నంబర్ 286 (సుచిత్ర) పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, స్థానిక నివాసితుల తరఫున డిప్యూటీ కమిషనర్, కుత్బుల్లాపూర్ సర్కిల్ శ్రీ నరసింహ గారికి ప్రతినిధిత్వం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ ఒక పురాతనమైన చారిత్రక ప్రాధాన్యత కలిగిన గ్రామమని, అదే పేరుతో అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఉన్నదని తెలిపారు. అసలు కుత్బుల్లాపూర్ గ్రామానికి సంబంధించిన భౌగోళిక పరిధి మరియు ఓటర్ల సంఖ్య ఎక్కువగా ప్రస్తుతం డివిజన్ నంబర్ 286 పరిధిలో ఉన్నందున, ఆ డివిజన్‌కు "కుత్బుల్లాపూర్" పేరు సరైనదని వివరించారు. అలాగే కుత్బుల్లాపూర్ గ్రామ నివాసులు తమ సంప్రదాయ గ్రామ గుర్తింపును వదిలి "సుచిత్ర" అనే పేరుతో గుర్తించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల డివిజన్ నంబర్ 286ను "కుత్బుల్లాపూర్ డివిజన్"గా పునర్నామకరణ చేయాలని, అలాగే డివిజన్ నంబర్ 284కు అక్కడి కాలనీల ఆధారంగా సరైన కొత్త పేరు పెట్టాలని, స్థానిక కాలనీ సంక్షేమ సంఘాలతో సంప్రదింపులు జరిపి తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరారు. డివిజన్ పేర్లను తార్కికంగా, చారిత్రక న్యాయం మరియు ప్రజల భావోద్వేగాలను దృష్టిలో పెట్టుకొని మార్చితే ప్రజల ఆమోదం, సరైన ప్రతినిధిత్వం లభిస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశీలించి, తుది డిలిమిటేషన్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్‌తో పాటు పులి బలరాం, వడ్ల లక్ష్మణ్, గ్రామ పెద్దలు మరియు యువకులు పాల్గొన్నారు.

## అమెరికా నుంచి వచ్చి ఓటు వేసిన మామ... ఒక్క ఓటు తేడాతో గెలిచిన కోడలు



ఇది కద నిజం, నిర్మల్: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర ఘట్టం చోటుచేసుకుంది. ఒక్క ఓటు తేడాతో ముత్యాల శ్రీవేద విజయం సాధించి గ్రామ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారు.

ముత్యాల శ్రీవేద ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయం తెలుసుకున్న ఆమె మామ ముత్యాల ఇంద్రకరణ్ రెడ్డి అమెరికాలో ఉంటూ కూడా నాలుగు రోజుల ముందే స్వగ్రామానికి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఒక్క ఓటే చివరకు శ్రీవేద విజయానికి కీలకంగా మారడం విశేషం. ఈ ఎన్నికల్లో మొత్తం 426 ఓట్లు ఉండగా, 378 ఓట్లు పోలయ్యాయి. ముత్యాల శ్రీవేదకు 189 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి హర్షస్వాతికి 188 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఒక ఓటు చెల్లని ఓటుగా నమోదైంది. ఫలితంగా ఒక్క ఓటు ఆధిక్యంతో శ్రీవేద ఘన విజయం సాధించారు. అమెరికా నుంచి వచ్చి ఓటు వేసిన మామ నిబద్ధత, ప్రజాస్వామ్యంపై నమ్మకం గ్రామస్థులను ఆకట్టుకోగా, ఈ విజయం బాగాపూర్ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

## అత్తాపూర్ డివిజన్‌ను యథావిధిగా కొనసాగించాలి: భాస్కర్ గౌడ్



ఇది కద నిజం, అత్తాపూర్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన అత్తాపూర్ డివిజన్‌లో సులేమాన్ నగర్ డివిజన్‌కు చెందిన మీరాలం ట్యాంక్ సెట్విన్ కాలనీ, కిషన్‌బాగ్ ప్రాంతాలను కలపడం వల్ల అత్తాపూర్ డివిజన్ వాసులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోందని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజెశారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ ఈ మార్పుల కారణంగా అత్తాపూర్ డివిజన్‌లోని స్థానిక సమస్యలు పక్కకు నెట్టబడే ప్రమాదం ఉందని, అలాగే ఇక్కడ పనిచేస్తున్న స్థానిక నాయకుల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో డివిజన్ స్వరూపాన్ని మార్చడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ నేపథ్యంలో అత్తాపూర్ డివిజన్‌ను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వ అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

# కవిత మీద అవాకులు పేలితే వి. ప్రకాష్ నీ నాలుక చీరేస్తాం

- హరీష్ రావు ఫేక్ టీమ్ కు లీడర్ గా నిన్ను ఎంపిక చేసినట్లు ఉన్నారు
- ప్యాకేజీ స్టార్ వి నువ్వు. సుపారీ ఇచ్చిన లీడర్ కు ఊడిగం చేస్తున్నావ్?
- బీఆర్ఎస్ ఓటమికి కేసీఆర్, కేటీఆర్ ల వైఖరే కారణమని గతంలో మాట్లాడావ్
- నీళ్ల విషయంలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసిన కవితమ్మను పొడిడావ్
- ఆరు నెలల్లో ఏమీ మారిందని ప్లేట్ మార్చావ్
- నిరాధరమైన ఆరోపణలు, నిందలు వేస్తే నిన్ను బొందపెడతాం
- కవితమ్మ అవినీతిలో కూరుకుపోయిందంటూ బద్నాం చేసే వారికి తీవ్ర పరిణామాలుంటాయ్
- జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, సీనియర్ నాయకులు ఇస్మాయిల్



ఇది కద నిజం: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పై పథకం ప్రకారం తప్పుడు ప్రచారం చేస్తున్నారని జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, జాగృతి సీనియర్ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మాటలనే కవిత మాట్లాడుతున్నారంటూ వి. ప్రకాశ్ అనే వ్యక్తి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు.

రూప్ సింగ్ మాట్లాడుతూ వి. ప్రకాష్ చరిత్ర తెలంగాణ ప్రజలందరికీ తెలుసు అని అన్నారు. హరీష్ రావు ఏర్పాటు చేసుకున్న ఫేక్ టీమ్ కు లీడర్ గా వి. ప్రకాష్ మాట్లాడుతున్నారని అన్నారు. స్వయం ప్రకటిత మేధావిగా చెప్పుకునే వి. ప్రకాష్ గతంలో కేసీఆర్, కేటీఆర్ గురించి కూడా తప్పుగా మాట్లాడారని గుర్తు చేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కేసీఆర్, కేటీఆర్ అహంకారమే కారణమని వి. ప్రకాష్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారన్నారు. హరీష్ రావు ను గొప్ప లీడర్ అన్నట్లుగా ప్రచారం చేసేందుకు ఇష్టమొచ్చినట్లు అబద్దాలు చెబుతున్నారన్నారు. నీళ్ల విషయంలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసిన కవితమ్మ గారిని ఇదే వి. ప్రకాష్ చాలా సార్లు పొగిడారన్నారు. కానీ ఆరు నెలల కాలంలో ఏమీ మారిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రశించారు. వి. ప్రకాష్ తో పాటు చాలా మంది విశ్లేషకులు, యూట్యూబ్ ఛానెల్స్ పేరుతో కవితమ్మను అవినీతి పరురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బద్నాం చేసే ప్రయత్నం చేసే వారి నాలుక చీరేస్తామని హెచ్చరించారు. జాగృతి జనం బాటలో కవితమ్మకు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేకనే కొంతమంది సోషల్ మీడియా టీమ్ లను పెట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని రూప్ సింగ్ మండిపడ్డారు.

జాగృతి సీనియర్ నేత సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ వి. ప్రకాష్ ఒక ప్యాకేజీ స్టార్ అని విమర్శించారు. తనకు సుపారీ ఇచ్చిన నేత ఆనందం కోసం కవితమ్మ మీద కట్టుకథలు చెబుతున్నాడన్నారు. మేధావి, విశ్లేషకుడి ముసుగేసుకున్న వి. ప్రకాష్ చరిత్ర తెలంగాణ ప్రజలకు తెలుసునని అన్నారు. ఒక గొప్ప సామాజిక విప్లవ నేత మరణానికి ఆయనే కారణమని చెప్పారు. సాయుధ, విప్లవ పోరాటాల నుంచి తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ వరకు కూడా అవకాశ వాద కుట్రలు చేసిన వ్యక్తి వి. ప్రకాష్ అని చెప్పారు. నువ్వొక పిట్టల దొర వి, ప్యాకేజీ స్టార్ వి, గొలుసు కట్టు వ్యాపారివి అంటూ వి. ప్రకాష్ పై మండిపడ్డారు. ఒక నాయకుడు కవితమ్మ గారి గురించి తప్పుగా మాట్లాడాలని చెబితే నువ్వు మాట్లాడుతున్నావ్ అని అన్నారు. కవితమ్మను బద్నాం చేసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తే తెలంగాణ సమాజం నమ్మదని అన్నారు. దమ్ముంటే ఆధారాలతో సహా మాట్లాడాలని...ఆధారాలు ఉంటే చర్చకు తాను సిద్ధమని ఇస్మాయిల్ చెప్పారు. నిరాధరమైన ఆరోపణలు చేస్తే తరిమికొడతామని హెచ్చరించారు. మీ లాంటి మొరిగే కుక్కలను తెలంగాణ సమాజం పట్టించుకోదన్నారు. వి. ప్రకాష్ నీ మానసిక పరిస్థితి బాగాలేనట్లు ఉంది...వెంటనే హాస్పిటల్ లో చూపించుకో అని ఆయనకు సూచించారు. ప్రజల ముందు మీరు చేసిన తప్పులను బయటపెడితే వాటికి సమాధానం చెప్పే ధైర్యం లేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాధమైన ఆరోపణలు, నిందలు వేస్తే బొంద పెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో కవితక్క పై తప్పుడు ప్రచారాలు చేస్తున్న గుంటనక్కల సముహానికి సరైన జవాబు చెబుతామన్నారు.




# పరిగి ఆర్టీసీ డిపో నుంచి ఉత్తర భారత ధార్మిక క్షేత్రాలకు యాత్ర

ఇది కద నిజం, పరిగి:పరిగి ఆర్టీసీ డిపో నుంచి ఉత్తర భారతదేశంలోని ప్రముఖ ధార్మిక క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక యాత్రను ఏర్పాటు చేశారు. ఈ యాత్ర 23-12-2025 న ఉదయం 8 గంటలకు పరిగి ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరనుంది.ఈ యాత్రలో బాసర, ప్రయాగ్రాజ్ (త్రివేణి సంగమం), వారణాసి (కాశి), అయోధ్య, ఓంకారేశ్వర్, మహాకాళేశ్వర్ వంటి పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోనున్నారు. దర్శన కార్యక్రమం అనంతరం 28-12-2025 న రాత్రి 10 గంటలకు పరిగి చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు.ఇట్టి యాత్రకు ఒక్కో వ్యక్తికి రూ.7,700 ఖర్చు అవుతుందని, పరిమిత సంఖ్యలో సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల భక్తులు ముందస్తుగా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# అత్తాపూర్ లో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 75వ వర్ధంతి..



ఇది కదా నిజం, అత్తాపూర్:అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడా సర్దార్ పటేల్ చౌరస్తాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 75వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు సులిగె వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంటు బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ, నిరంకుశ నిజాం పాలనను ఎదిరించి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన మహానాయకుడు ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఆనాటి భారతదేశ ఉప ప్రధానిగా 565 సంస్థానాలను అఖండ భారతదేశంలో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కే దక్కుతుందని పేర్కొన్నారు. ఆయన దేశ ఐక్యత, సమగ్రత కోసం చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.నేటి యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని "ఐకమత్యమే మహాబలం" అనే నినాదంతో ముందుకు సాగాలని, దేశభక్తి, క్రమశిక్షణ, సమైక్యతను జీవిత లక్ష్యాలుగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ పి. మల్లేష్ యాదవ్, కాడెం సుధాకర్, సత్యనారాయణ ముదిరాజ్, సాబాద విజయ్ కుమార్, ఎస్. జయానంద్ రెడ్డి, ఆర్. రాజశేఖర్, కే. కిరణ్ చారి, గౌరిగి రాజు, రావుల జగన్, పి. వెంకట్ రెడ్డి, కొంగళ్ల బుచ్చయ్య, కాకులారం కృష్ణ, బీట్కూరి సతీష్, లఖన్, శివరాజ్, పొట్ట అనిల్, శ్రీకాంత్ చారి, బీస భరత్, లక్ష్మీకాంత్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలోనే తొలిసారి.. సరికొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన టీటీడీ.. 100 ఎకరాల్లో..!!

దేశంలోనే తొలిసారిగా టీటీడీ 100 ఎకరాల్లో దివ్య వృక్షాల ప్రాజెక్ట్ ప్రారంభించింది. ధ్వజస్తంభ నిర్మాణానికి అవసరమైన పవిత్ర వృక్షాలను స్వయంగా పెంచి, సంరక్షించడం దీని లక్ష్యం. ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాజెక్ట్ ప్రాధాన్యతనిస్తుంది. టీటీడీ ఆలయాలకు అవసరమైన కలపను అందిస్తూ, భవిష్యత్ తరాలకు సంప్రదాయాలను, ప్రకృతిని అందివ్వడమే ఈ వినూత్న ప్రయత్నం యొక్క ముఖ్య ఉద్దేశం.



దేశంలోనే తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు దిశానిర్దేశం చేసే దివ్య వృక్షాల ప్రాజెక్టుకు టీటీడీ శ్రీకారం చుట్టింది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం ప్రాచీన, ఆగమ శాస్త్రాలకు అనుగుణమైన హిందూ దేవాలయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను టీటీడీ స్వయంగా పెంచి, పరిరక్షించి వినియోగించడమేనన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో రూపొందించిన తిరుమల అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉంటుందన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే బాధ్యతాయుత పాలనకు ఇది నిదర్శనమని బీ.ఆర్ నాయుడు అన్నారు.

### ధ్వజస్తంభానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం

ధ్వజస్తంభం కేవలం నిర్మాణాత్మక అంశం మాత్రమే కాదు. అది భౌతిక లోకానికి, దైవ లోకానికి మధ్య ఉన్న శాశ్వత బంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆలయ ప్రాంగణంలో నిటారుగా నిలిచి ఉండే ధ్వజస్తంభం భక్తి, పవిత్రత, దైవ సన్నిధిని ప్రతిబింబిస్తుంది. ఆగమశాస్త్రాల ప్రకారం ధ్వజస్తంభం నిటారుగా పెరిగిన ఒకే చెట్టుకు చెందిన పవిత్ర వృక్ష కాండంతో తయారు చేయాలి. ఆ వృక్షాన్ని ఆధ్యాత్మిక, జ్యోతిష్య, విధి విధానాలకు అనుగుణంగా ఎంపిక చేసి, ఏళ్ల తరబడి సంరక్షించి, ఆపై శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం వినియోగిస్తారు.

### ధ్వజస్తంభాల కోసం ఉపయోగించే పవిత్ర వృక్షాలు

ఆగమ సంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభాల తయారీలో సాధారణంగా టేకు, ఏగిశా (ఇండియన్ కినో), టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను వినియోగిస్తారు. ఇవి బలంగా, దీర్ఘకాలికంగా నిటారుగా పెరిగే స్వభావం కలిగి ఉండటం వల్ల ధ్వజస్తంభం అవసరాలకు అనుకూలంగా ఉంటాయి. పరిపక్వత చెందిన తర్వాత ఆ వృక్షాన్ని శాస్త్రోక్తంగా పూజించి, ఆపై ధ్వజస్తంభంగా రూపకల్పన చేస్తారు. అనంతరం దానిని కవచంతో కప్పి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం లాంటి అత్యంత పవిత్ర ఆలయాల్లో స్వర్ణ కవచంతో అలంకరిస్తారు. ఇక రాజగోపురం, గర్భగుడి విమానం మధ్య పవిత్ర ప్రదేశంలో ప్రతిష్ఠించే ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఆవిష్కరిస్తారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని ప్రకటించే ఈ ధ్వజారోహణం సమస్త లోకాల్లోని దేవతలను ఆహ్వానించే శుభ సూచకంగా నిలుస్తుంది.

### దివ్య వృక్షాల పెంపకంపై టీటీడీ దూరదృష్టి

ఇక దేశవ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను టీటీడీ నిర్వహిస్తోంది. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాలను ఆగమ నియమాలకు అనుగుణంగా నిర్మించే బాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ దివ్య వృక్షాల ప్రాజెక్టును అత్యంత దూరదృష్టితో ప్రారంభిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా కాలక్రమేణ మార్పు అవసరమైన ధ్వజస్తంభాల స్థానంలో శాస్త్రోక్తంగా కొత్త ధ్వజస్తంభాలను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో టీటీడీ నిర్మించనున్న ఆలయాలకు అవసరమైన ధ్వజస్తంభాల కోసం పవిత్రమైన కలపను ముందుగానే సిద్ధం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

### దివ్య వృక్షాల ప్రాజెక్టు వివరాలు ఇవే

ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భాగంగా సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో దివ్య వృక్షాల ప్రాజెక్టు కోసం కేటాయించాలని టీటీడీ బోర్డు ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు అమలుతో, ధ్వజస్తంభాల కోసం అవసరమైన దివ్య వృక్షాలను స్వయంగా పెంచే తొలి దేవాలయ సంస్థగా టీటీడీ దేశంలో చరిత్ర సృష్టించనుంది. దీని ద్వారా ఆగమ శుద్ధి, ఆధ్యాత్మిక పవిత్రత, పర్యావరణ బాధ్యత, సంస్థాగత స్వావలంబనను తరతరాలకు కొనసాగించగలుగుతామని టీటీడీ స్పష్టం చేసింది.

# షేక్‌పేట్‌లో 9వ ఎలైట్ మెన్ అండ్ ఉమెన్ హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్




ఇది కదా నిజం, హైదరాబాద్: షేక్‌పేట్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 9వ ఎలైట్ మెన్ అండ్ ఉమెన్ హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌ను ఈ నెల 14, 15 తేదీల్లో విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్ జిల్లాకు చెందిన పలు బాక్సింగ్ క్లబ్‌ల నుంచి బాక్సర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.




ఈ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన బాక్సర్లు డిసెంబర్ 19, 20, 21 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ కంటెస్టెడ్ కార్పొరేటర్ సి. మహేష్, తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బీడీ మన్మోహన్, ఎల్లయ్య, బల్ బహదూర్ సింగ్, హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, ప్రధాన కార్యదర్శి వినేష్ బాబు హాజరయ్యారు. అలాగే శ్రీనివాస్, లక్ష్మణ్, వంశీ, శ్యామ్, టింకు, శివకుమార్, లోకేష్, సన్నీతో పాటు హైదరాబాద్‌కు చెందిన కోచ్‌లు, బాక్సర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన బాక్సర్లకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బాక్సింగ్ క్రీడ అభివృద్ధికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అతిథులు పేర్కొన్నారు.

# బహదూర్పుర నియోజకవర్గంలోని ప్లే గ్రౌండ్ల అభివృద్ధికి GHMC అధికారులను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఇది కదా నిజం, హైదరాబాద్ : బహదూర్పుర నియోజకవర్గం పరిధిలోని దూద్‌బౌలి ఉందా బజార్‌లో ఉన్న శివాజీ ప్లే గ్రౌండ్‌తో పాటు కిషన్‌బాగ్ డివిజన్‌లోని బహదూర్పుర హౌసింగ్ బోర్డు కాలనీలో గల GHMC ప్లే గ్రౌండ్‌లకు ప్రహరీ గోడలు నిర్మించి, అందులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ GHMC ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ (స్పోర్ట్స్) కె. మంగతుయారుని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అక్కడి యువత, పిల్లలకు క్రీడలు ఆడేందుకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లు కూడా అందించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన అదనపు కమిషనర్ క్రీడా విభాగానికి చెందిన స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్‌ను తక్షణమే అవసరమైన క్రీడా సామాగ్రి అందించాల్సిందిగా ఆదేశించారు.

ఈ భేటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీర్ మహమ్మద్ అలీ, అడ్వకేట్ జకేర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని క్రీడా మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని కాంగ్రెస్ ఇంచార్జి పులిపాటి రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

# ఈ నెల 17న తెలంగాణ భవన్‌లో అయ్యప్ప మహాపడిపూజ

**: తలసాని సాయికిరణ్ యాదవ్**




బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్ యాదవ్ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు నిర్వహించనున్న ఈ మహా పడిపూజకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు.మంచి సంకేతం ఇవ్వాలని అయ్యప్ప పూజ చేస్తున్నామని.. ఈ పూజకు అందర్నీ ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో తలసాని సాయి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం నిరూపితమైందని తెలిపారు. 50 శాతం పంచాయతీలను కాంగ్రెస్ గెలుచుకోలేకపోయిందని అన్నారు. పాలన గాలికొదిలేసి ఫుట్‌బాల్ మ్యాచ్‌లపై దృష్టి పెడితే ప్రజలు ఇలాంటి తీర్పునే ఇస్తారని వ్యాఖ్యానించారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అద్భుత విజయాలు వచ్చాయని బీఆర్ఎస్ నేత చిరుమళ్ల రాకేశ్ కుమార్ తెలిపారు. రెండు విడతల్లో సగం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు వ్యతిరేకంగా తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్వగ్రామాల్లోనూ అధికార పార్టీని ప్రజలు ఓడించారని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి సమానంగా ఓట్లు వస్తే కాంగ్రెస్ గెలిచినట్లుగా ప్రకటించారని మండిపడ్డారు. ఓటు చోరీ జరిగిందని ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారని.. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మోరీల్లో బ్యాలెట్ పేపర్లు దొరుకుతున్నాయని అన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఫ్యాక్షన్ రాజకీయాలు నడుపుతోందని చిరుమళ్ల రాకేశ్ విమర్శించారు. తెలంగాణలో వ్యక్తిగత కక్షలు ఉండవని.. ఏపీలో ఫ్యాక్షన్ రాజకీయాలు ఏవిధంగా నడుస్తున్నాయో తెలంగాణకు అదే సంప్రదాయం తీసుకొచ్చారని మండిపడ్డారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకి మంచి ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

# గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర: సీతక్క



ఇది కదా నిజం,హైదరాబాద్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. పథకం పేరునే కాకుండా దాని ఆత్మను, అమలు విధానాన్ని మార్చేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను ఆమె తప్పుబట్టారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆక్షేపించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును ' వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును ఆమె తప్పుబట్టారు. గతంలో వంద శాతం నిధులు వెచ్చించి.. పథకాన్ని అమలు చేసిన కేంద్రం ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని మంత్రి సీతక్క అన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని సీతక్క ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపుతోందని విమర్శించారు.